ఉపాధి హామీ మస్తర్లలో అవినీతి జరిగితే సహించేదే లేదు

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, పెన్ పవర్, జూలై 5: ఉపాధి హామీ పథకం మస్తర్ల విషయంలో అవినీతి జరిగితే సహించేదే లేదని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో శుక్రవారం జగ్గంపేట నియోజకవర్గంలోని జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండలాలకు సంబంధించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఎమ్మెల్యే నెహ్రూ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పని కోరిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్నారు. రైతులకు, గ్రామ అభివృద్ధికి పనికొచ్చే పనులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని నెహ్రూ పేర్కొన్నారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

ఈనెల 8 నుండి ఇసుక విక్రయాలు ప్రారంభం

- అందుబాటులో 1లక్ష 66 వేల టన్నుల ఇసుక
- కొత్త ఇసుక పాలసీ అమలు
- జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్

గంగవరం/ పాడేరు, పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్, జూలై 5 : ఈనెల 8 నుండి ఇసుక విక్రయాలు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులు, రవాణా శాఖ అధికారులు, గనులు భూర్భ శాఖ అధికారులతో జిల్లా స్థాయి సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతూరు డివిజన్ గుండాల -1 రీచ్ వద్ద 87,800 టన్నులు, గుండాల -2 రీచ్ లో 79,026 టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. సీనరేజ్ టన్నుకు రూ.88 మాత్రమేనని మిగిలిన లోడింగ్, పరిపాలనా చార్జీలు, జి.ఎస్.టి చార్జీలు నిబంధనల మేరకు చెల్లించ వలసి ఉంటుందన్నారు. అన్ని చార్జీలతో కలసి గుండాల - 1 రీచ్ లో ఉన్న ఇసుకకు టన్నుకు రూ.292 లు, గుండాల - 2 రీచ్కు రూ.237 లు చెల్లించాలని స్పష్టం చేసారు. ఇసుక విక్రయాలకు గిరిజన అభ్యర్థుల తో కూడిని ఏజెన్సీని గుర్తించాలని సూచించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట, పాడేరు ఐటిడిఏ పి. ఓ, వి. అభిషేక్, రంపచోడవంర పి. ఓ, సూరజ్ గనోరే, చింతూరు పి. ఓ. కావూరి చైతన్య, గనులు భూ గర్భ శాఖ అసిస్టెంట్ జియాలజిస్ట్ బి.రవికుమార్, రాయల్టీ ఇన్స్పెక్టర్ ఎస్.రాంబాబు, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 కోట్లతో లింకు రోడ్ల నిర్మాణం

తాడేపల్లిగూడెం, పెన్ పవర్,జులై 5:మార్కెట్ యార్డులో ఏడాదికి రెండు కోట్లతో అనుసంధాన రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డు ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్లలో రూ.10 కోట్లతో లింక్ రోడ్లు నిర్మిస్తామ న్నారు. అవసరమైతే సీఎం చంద్రబాబును మరిన్ని నిధులు కోరతామన్నారు. అధికారులు రైతాంగ శ్రేయస్సు కోసం పని చేయాలన్నారు. అలస త్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. మార్కెట్ యార్డ్ ను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని ఏమైనా తేడాలుంటే ఉపేక్షించేది లేదన్నారు. అవినీతికి పాల్పడితే ఊరుకోమని హెచ్చరించారు. రైతాంగానికి మేలైన సేవలు అందించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.ఆయన వెంట ఏఎంసీ గ్రేడ్-1 కార్యదర్శి ఎం ఎన్ వి ప్రభాకర్, ఉమ్మడి నాయకులు ఉన్నారు.

ప్రజలకు సురక్షిత మంచినీరు అందించాలి కలెక్టర్.

అమలాపురం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జూలై 5: కోనసీమ జిల్లాలో ప్రజానీకానికి తలసరి రోజువారి ప్రామాణికంగా 55 లీటర్లు సురక్షిత మంచినీరు సమృద్ధిగా అందించాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆర్డబ్ల్యూఎస్ గ్రామపంచాయతీ అధికారులు మున్సిపల్ అధికా రులను ఆదేశించారు. శుక్రవారం ఆర్డబ్ల్యూఎస్ గ్రామపంచాయతీ మున్సిపల్ అధికారులతో సురక్షిత త్రాగునీరు సరఫరా అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కమ్యూనిటీ రక్షిత మంచినీటి పథకాల ద్వారా సురక్షిత త్రాగునీటిని నిత్యం సరఫరా చేయాలని సూచించారు. ఎక్కడ కలుషితనీరు సరఫరా కాకుండా మెలకువలు పాటించాలన్నారు. డయేరియా వ్యాధులు వ్యాప్తికి కారణమైన కలుషిత త్రాగునీరు సరఫరా కాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. నీరు కలుషితమై సెలైన్ వాటర్ గా మారకుండా పటిష్టమైన చర్యలను గైకొనాలన్నారు. వాటర్ ఫిల్టర్ లను రెగ్యులర్ గా మార్చుతూ క్లోరినేషన్ ప్రక్రియను చేపట్టి ప్రజలు అనారోగ్యం పాలు కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి పథక ఆశయాలను సిద్ధింప చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ

సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్లు జి.వెంకట్రామిరెడ్డి ఎస్.మనోహర్, డిపిఓ దాసరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మార్పీఎస్ నాయకులు

అమలాపురం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జూలై 5: అంబేద్కర్ కోనసీమ జిల్లా నూతన కలెక్టర్ మహేష్ కుమార్ ని మర్యాద పూర్వకం గా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్.ఆర్.పి. ఎస్.ఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ఈతకోట రాజు, ఉపాధ్యక్షులు కొడమంచిలి సాయి కుమార్, ఈ సందర్భంగా ఈ జిల్లాలో మాదిగ పల్లెలో ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు, రోడ్లు, డ్రైన్లు, మంచినీటి సౌకర్యలకు మరియు గృహ నిర్మాణాలకు ప్రాధాన్యతనివ్వాలని కోరడం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ ని కలిసిన వారిలో ఎం.ఆర్.పి. ఎస్. ఎస్ నాయకులు కొల్లు నాగు, కొడమంచిలి సురేష్, తొత్తరమూడి ఆనంద్, చుట్టుగుళ్ల రాజేష్, ఈతకోట నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసిన నాయకులు

తాళ్ళపూడి, పెన్ పవర్, జులై 5:తాడేపల్లిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఆయన క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసిన వైఎస్ఆర్సీపీ యువ నాయకులు ముద్రగడ గిరిబాబు, వైఎస్ఆర్సీపీ తూర్పు గోదావరి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు తోట రామకృష్ణ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కాపు సంఘం అధ్యక్షులు చినమిల్లి వెంకట్రాయుడు, గోపాలపురం ఎంపీపీ కుప్పాల దుర్గారావు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో పార్టీ ఓటమిపై చర్చించడం జరిగిందని తోట రామకృష్ణ అన్నారు. అలాగే జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ మీరందరూ ధైర్యంగా ఉండి నాయకులకు, కార్యకర్తలకు ధైర్యం నింపాలని కోరినట్లు, అదేవిధంగా త్వరలోనే ఓదార్పు యాత్రకు వస్తానని తెలిపినట్లు తోట రామకృష్ణ తెలియచేశారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షులను కలిసిన మంత్రి సుభాష్

కాజులూరు,పెన్పవర్,జూలై5:ఇటీవల ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన పల్లా శ్రీనివాసరావును శుక్రవారం రాష్ట్ర కార్మికశాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ మర్యాదపూర్వకంగా తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో ఆనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ముందుగా మంత్రి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో పల్లాను సత్కరించారు.ఈనేపథ్యంలో పార్టీ విధి విధానాలపై వారు చర్చించారు.మంత్రితోపాటు కాపునేత గంధం పల్లంరాజు,పార్టీ నాయకులు రాయపురెడ్డి రాజా, చిక్కాల గణేష్ తదితరులున్నారు.

మంత్రి ఇలాకాలో అంబేడ్కర్‌కు ఘోర అవమానం

- వెల్ల గ్రామంలో విగ్రహం ధ్వంసం
- మండిపడుతున్న ధళిత నేతలు
- నిందితులను పట్టుకుంటాం ..పోలీసులు

కాజులూరు,పెన్పవర్,జూలై5:%బి%8:కోనసీమ జిల్లా రామంచంద్రపురం నియోజకవర్గం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతం వెల్లగ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కు ఘోర అవమానం జరిగింది.ఇటీవల నెల రోజుల క్రితం ఎర్రపోతవరం గ్రామంలో అంబేడ్కర్‌కు చెప్పుల దండవేసి అవమానించిన ఘటన జరిగి నెలరోజులు కూడా పూర్తికాలేదు. ఇంతలోనే వెల్ల అరుంధతి పేటలో మరో ఘటన జరగడంపై మాలలు మండిపడుతున్నారు.దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని పలు దళిత,ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.స్థానికులు,ప్రజా సంఘాలనేతల వివరాలు మేరకు..శుక్రవారం తెల్లవారు జామున రామచంద్రపురం మండల పరిధిలోని వెల్ల అరుంధతి గ్రామంలో రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్,బాబూ జగజ్జీవన్ రావుల విగ్రహాలను జంటగా ఏర్పాటు చేశారు.అయితే కొంతమంది దుండగులు అంబేడ్కర్ విగ్రహాలను టార్గెట్ చేస్తూ ఇలాంటి విధ్వంసాలకు

-4 లో

ఏజెన్సీలో కృత్రిమ ఇసుక కొరత సృష్టిస్తున్న ఇసుక బకాసురులు

వై రామవరం/ అడ్డతీగల,పెన్ పవర్, జూలై 5 : ఏజెన్సీలో సెలయేర్ల నుండి ఉచితంగా లభ్యమయ్యే ఇసుకను కొందరు బకాసురులు కృత్రిమ కొరతను సృష్టిస్తూ వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వై.రామవరం, అడ్డతీగల మండలాల్లో చాలా చోట్ల ఇసుక నిల్వలు ఉన్నాయని, ఇది సమాచారం అంతా అధికారులకు తెలుసు అని పలువురు అంటున్నారు.

ఏజెన్సీలో ట్రాక్టర్ ఇసుక (యూనిట్ కన్నా తక్కువ) మూడు వేల రూపాయలు అమ్మకాలు సాగిస్తున్నారని, దీనివల్ల వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఇసుక బకాసురులు మాత్రం సెలయేర్లు నుండి ఉచితంగా తోడేస్తూ లక్షల అద్దిస్తున్నారని, దీనిపై ఏ ఒక్క అధికారి కూడా స్పందించిన దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో దాదాగిరి చేసిన వ్యక్తులే నేటికీ ఇసుక పై పెత్తనం కొనసాగిస్తున్నారని పలువురు అంటున్నారు.

-4 లో

రాష్ట్రంలో పారదర్శకత ప్రభుత్వం ఏర్పడిందనడానికి సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనే నిదర్శనం

- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, పెన్ పవర్, జూలై 5: రాష్ట్రంలో పారదర్శకత కలిగిన ప్రభుత్వం ఏర్పడిందనడానికి నిదర్శనం సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ఆర్థిక చేయూత ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పునః ప్రారంభానికి సత్వర చర్యలు తీసుకోవాలని, అమరావతి రాజధాని ప్రాంతంలో ముఖ్యమైన మౌలిక వసతులు ప్రత్యేక భవనాల సముదాయం పూర్తి కావడానికి సమగ్ర ఆర్థిక సాయం అందించాలని, పారిశ్రామిక అభివృద్ధికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని, రాష్ట్రానికి మూల ధన వ్యయం అందించేందుకు ప్రత్యేక పథకం కింద ఆంధ్రప్రదేశ్ కు అదనపు కేటాయింపులు జరిపి రహదారులు, వంతెనలు, సాగునీరు, త్రాగునీరు, ప్రాజెక్టులు పూర్తయ్యేలా చూడాలన్నారు. బుందేల?ండ్ ప్యాకేజీ తరహాలో రాష్ట్రంలో వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని, దుగరాజపట్నం పోర్టు పూర్తిచేసేలా రాష్ట్రానికి చేయూత అందించాలని ప్రధానమంత్రి కి వినతి అందించారన్నారు. మంత్రులు అమిత్ షా, నితిన్ గట్కారి, పియూషి గోయల్, శివరాజ్ సింగ్ సోహన్ మనోహర్లాల్ బట్టర్, హరిదీప్ సింగ్ వంటి కేంద్ర మంత్రులతో రాష్ట్ర సమాగ్రాభివృద్ధికి సహాయం చేయాలని కోరడం జరిగిందన్నారు. కానీ గత ప్రభుత్వంలో జగన్ రెడ్డి ఢిల్లీ వెళ్తే తన పైన, తన తమ్ముడి పైన కేసులు గురించే పర్యటించేవారు తప్ప రాష్ట్ర అభివృద్ధికి ఎప్పుడూ కేంద్ర ప్రభుత్వానికి వినతులు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో అమరావతి మళ్లీ పునర్నిర్మాణం జరగాలంటే ఉన్న రోడ్లు మౌలిక వసతులు కల్పించుకోవడానికి 60 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని నెహ్రూ అన్నారు. తన ప్రధాన హామీల్లో ఒకటైనటువంటి పరిశ్రమ స్థాపనకు లండన్ నుంచి ప్రతినిధి వచ్చారని వారిని ముఖ్యమంత్రితో చర్చించి పరిశ్రమ స్థాపనకు సహాయం అందించి ఇక్కడ నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనకు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా పుష్కర పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలు పూర్తిస్థాయిలో నడవాలంటే తక్షణం రెండు కోట్ల 30 లక్షల రూపాయలు కావాలని సంబంధిత ఇరిగేషన్ మంత్రితో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి నిధులు సమకూర్చడానికి ప్రయత్నాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, బస్వా చినబాబు, మండపాక అప్పన్న దొర, పిలా మహేష్, మండిగ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఇలాకాలో అంబేడ్కర్‌కు ఘోర అవమానం

- 3 పేజి తరువాయి

పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.అలాగే కొంతమంది రాజకీయనాయకుల కుట్రలో భాగంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని,ఇలాంటి ఘటనలు మరలా పునరావృతం కాకుండా త్వరిత గతిన నిందితులను పోలీసులు పట్టుకుని తగిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.విషయం తెలుసుకున్న రామచంద్రపురం డిఎస్పీ రామకృష్ణ,సీఐ పి.దొరరాజు,రామచంద్రపురం,గంగవరం, ద్రాక్షారామ ఎస్సైలు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.అనంతరం డాగ్ స్క్వా డ్,క్లూస్ టీం బృందాలతో నిందులను పట్టుకునేందుకు పలు సాంపిల్స్ సేకరించారు.ఈ నేపథ్యంలో డిఎస్పీ మాట్లాడుతూ రామంచంద్రపురం పీఎస్‌లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.నిందితులను అతి త్వరలో పట్టుకోవడం జరుగుతుందని ఆయన దళితనేతలకు వివరించారు . కచ్చితంగా దోషులను పట్టుకోవడం జరుగుతుంది, చట్టం తనపని తను చేసుకుంటుపోతుందని , ఎవరిని ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.ఈకార్యక్రమంలో పలువురు దళిత ప్రజా సంఘాల నాయకులు ,పోలీసులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరును అభివృద్ధి చేయడమే ఏకైక లక్ష్యం..

- అందర్నీ కలుపుకొని.. అందరి సహకారంతో ముందుకు వెళ్తాం : ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్
- మేయర్ ఎస్ అముద అధ్యక్షతన నగరపాలక సాధారణ కౌన్సిల్ సమావేశం.
- ఎక్స్ అఫిషియో సభ్యులుగా ప్రమాణం చేసిన చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్ మోహన్, డా.కిలికిరి మురళీమోహన్

చిత్తూరు, జులై 05 పెన్ పవర్ న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలిసి వచ్చే వారందరిని కలుపుకొని, అందరి సహకారంతో చిత్తూరు నగర అభివృద్ధే ఏకైక లక్ష్యంగా ముందుకెళ్తామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. చిత్తూరు నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నగర మేయర్ ఎస్ అముద అధ్యక్షతన జరిగింది. నగరపాలక కౌన్సిల్ ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఇటీవల ఎన్నికల్లో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల శాసనసభ్యులుగా విజయం సాధించిన గురజాల జగన్ మోహన్, డా.కలికిరి మురళీమోహన్ లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మేయర్ ఎస్ అముద, కమిషనర్ డా. జె అరుణ, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు ఎమ్మెల్యేలకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ గా అభివృద్ధి...

కౌన్సిల్ సాధారణ సమావేశంలో భాగంగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ.. నగర పర్యటనలో భాగంగా మార్కెట్ను అభివృద్ధి చేయాలని భావించానని.. అందుకే ఎమ్మెల్యే అయిన తర్వాత నగరం నడిబొడ్డున ఉన్న కూరగాయల మార్కెట్ ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. నగరంలోని అనువైన ప్రాంతాల్లోనూ ప్రజల సౌకర్యార్థం మార్కెట్లను, రైతు బజార్లను, మామిడికాయల మండిని అభివృద్ధి చేస్తామన్నారు. నగరంలో ప్రతి ఇంటికి నీటి సరఫరా చేసేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చే హామీలను అమలుపరిచేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు.

రైతులకు అవకాశం కల్పించాలి..

చిత్తూరులో అభివృద్ధి చేస్తున్న మార్కెట్లో చిత్తూరు నగరపాలక పరిసరాల్లోని మండలాల రైతులకు తగిన అవకాశం కల్పించాలని పూతలపట్టు ఎమ్మెల్యే డా.కలికిరి మురళీమోహన్ కోరారు. చిత్తూరు నగర పాలక కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిత్తూరు నగరంలోని మార్కెట్ ను ఇంటిగ్రేటెడ్ మార్కెట్ గా అభివృద్ధి చేయడం అభినందనీయమని, ఇదే సమయంలో పరిసర మండలాల రైతులకు అవకాశం కల్పించాలన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పై కమిషనర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్..

చిత్తూరు నగరంలోని చర్చి వీధిలోని పాత కూరగాయలు, చేపల మార్కెట్లను ఆధునిక ఇంటిగ్రేటెడ్ మార్కెట్ గా అభివృద్ధి చేయడంపై కమిషనర్ డా. జె అరుణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్ లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, స్థలాభావం, పార్కింగ్ కొరత, ట్రాఫిక్, పరిసర ప్రాంతాల ప్రజల ఇబ్బందులను తెలియజేస్తూ.. ఆధునిక ఇంటిగ్రేటెడ్ మార్కెట్ గా అభివృద్ధి చేయడం ద్వారా అందుబాటులోకి వచ్చే సౌకర్యాలను సచిత్రంగా వివరించారు. నిత్యవసరాలు, ఇతర కూరగాయలకు వేరువేరుగా దుకాణాల కేటాయింపు నమూనాలు, మటన్, ఫిష్ కోసం ప్రత్యేక దుకాణాలు, టాయిలెట్స్, ధరల డిస్ప్లే బోర్డులు, బాలింతలకు ఫీడింగ్ రూమ్, వర్షపు నీటి నిర్వహణ, పార్కింగ్ సదుపాయం, గ్రీనరీ వంటి సదుపాయాలతో మార్కెట్ సరికొత్త రూపు రేఖలపై ప్రజెంటేషన్ ఇచ్చారు.

నగరపాలక కౌన్సిల్ సాధారణ సమావేశంలో అజెండా, టేబుల్ అజెండా అంశాలను సభ్యులు చర్చించి ఆమోదించారు. సమావేశంలో మొదటగా చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులైన దగ్గుమళ్ల ప్రసాద్ రావు, చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గ శాసనసభ్యులు గురజాల జగన్ మోహన్, డా. కలికిరి మురళీమోహన్ లు చిత్తూరు నగరపాలక సంస్థకు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎంపికకు అనుమతి తెలియజేసినట్లు సభ్యులకు తెలిపారు.

వార్డుల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను సీఎఫ్ఎంఎస్ పోర్టల్ నుండి తొలగించి సదరు పనులకు 15వ ఆర్థిక సంఘం ద్వారా పీఎఫ్ఎంఎల్ పోర్టల్ నందు అప్లోడ్ చేయుటకు ఇదివరకే ఆమోదించిన కౌన్సిల్ ప్రస్తావనను ర్యాటీఫై చేశారు.

చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ వారు కలెక్టర్ కు రాసిన లేఖ మేరకు అన్నా క్యాంటీన్ వద్ద నందమూరి తారక రామారావు విగ్రహం ఏర్పాటుకు ఆమోదించారు. స్వచ్ఛభారత్ 2. 0 నిర్వహణ నిమిత్తం నిపుణులను నియమించుకోవడానికి, గంగినేని చెరువు పార్క్ లో గల అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ప్రతిష్టకు మేయర్ వారు తీసుకున్న ముందస్తు ఆమోదంను ర్యాటిఫై చేశారు.

చిత్తూరు నగరపాలక సంస్థలోని మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ కొరకు అందిన దరఖాస్తుల నుంచి బి.నాగ కుమార్ ను ఎమ్మెల్యే ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించారు.

ప్రధాన మార్కెట్ స్థానంలో ఆధునిక వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించుటకు రూ.138.50 లక్షల నిధులను ఖర్చు చేయడానికి ఆమోదించారు. నగరపాలకకు సంబంధించి ఏఎస్ఎం కాంప్లెక్స్, ఎమ్మెస్సార్ కాంప్లెక్స్, జైహింద్, గుర్రప్ప నాయుడు షాపింగ్ కాంప్లెక్స్ నందు ఖాళీగా ఉన్న దుకాణాలకు వేలంపాట నిర్వహించడానికి, నగరపాలక పరిధిలో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ మున్సిపల్ వర్కర్లకు రూ.1000 చొప్పున పునరావృతం కాకుండా చెల్లించడానికి, నగరంలోని సీఎంటిఎస్ రోడ్డు పక్కన గాండ్లపల్లిలోని నివాసానికి సంబంధించి మైత్రి నగర్ గా గుర్తించి, మైత్రి నగర్ రోడ్డు 1,2,3,4,5 క్రాసులుగా నేమ్ బోర్డులు ఏర్పాటు చేయడానికి, నగరపాలక సంస్థలో పనిచేస్తూ మరణించిన ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఎక్స్ గ్రేషియా చెల్లించుటకు కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. సమావేశంలో డిప్యూటీ మేయర్లు ఆర్ చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, సహాయ కమిషనర్ రామకృష్ణుడు, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా పదవీ విరమణ వేడుక

కాజులూరు,పెన్‌పవర్,జూలై5ః8: కాజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పిఎన్‌వివి సత్యనారాయణ (పిఆర్‌టియు ప్రసాద్) పదవీ విరమణ వేడుక శుక్రవారం కన్నుల పండుగగా జరిగింది.ఆయన విద్యా శాఖలో టీచర్ గా 40 సంవత్సరాల సుదీర్ఘ బోధన చేసి, జూన్ 30 న రిటైర్మెంట్ అయినట్లు ఎంఈవో పి.జాన్ తెలిపారు. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాల నడుమ వేదమంత్రోచ్చరణతో అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ నేపథ్యంలో పలువురు ఉపాధ్యాయులు వారిని శాలువాలతో ,పుష్పగుచ్చాలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పంపన కృష్ణ మూర్తి ,%వీజూ% జాన్, టైర్డ్ డివైఈవో ధర్మరాజు గార్లు ముఖ్య అతిథులు గా హాజరై వారికి జ్ఞాపికలను అందజేసి ,శాలువాతో సత్కరించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే దంపతులు...

అనపర్తి,పెన్ పవర్,జూలై 5.అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి గెలవాలంటూ అభిమానులు, కుటుంబ సభ్యులు మొక్కిన మొక్కుబడులను వరుసగా తీర్చుకుంటూ వస్తున్నారు. మొక్కుబడుల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సతీమణి మహాలక్ష్మి దంపతులు తిరుమల శ్రీవారి దర్శనం చేసుకుని సాయంత్రానికి విజయవాడ చేరుకున్నారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన పండితులు రామకృష్ణారెడ్డి దంపతులకు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆయన వెంట రామకృష్ణారెడ్డి బాల్యమిత్రుడు గొలుగూరి వీర రాఘవరెడ్డి (వైజాగ్ జీవి), నల్లమిల్లి వెంకట కృష్ణారెడ్డి దంపతులు తదితరులు ఉన్నారు.

ఏజెన్సీలో కృత్రిమ ఇసుక కొరత సృష్టిస్తున్న ఇసుక బకాసురులు

- 3 పేజి తరువాయి

అక్రమ ఇసుక నిలువలను నిరోధించవలసిన రెవెన్యూ,పోలీస్ శాఖలు పట్టించుకున్న దాఖలాలు లేవని అంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సామాన్యునికి ఇసుకను అందుబాటులో లభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి:ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం, పెన్ పవర్,జులై 5 : భవననిర్మాణ కార్మికుల సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఏరియా తాపీ వడ్రంగి సెంటరింగ్ రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్,ఎఐటీయూసి నాయకులు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. కూటమి అధికారంలోకి రావడంలో భవన నిర్మాణ కార్మికుల తోడ్పాటు ఎంతో ఉందని , వారి సమస్యలు పరిష్కారం చేయాల్సిన బాధ్యత తమపై ఉందని ఎమ్మెల్యే అన్నారు.

కూటమి ప్రభుత్వం అమలు చేయ తలపెట్టిన కొత్త ఇసుక విధానం బాగుందని , దానివల్ల గృహ యజమానులకు మేలు జరుగుతుందని, కార్మికులకు ఉపాధి పెరుగుతుందని యూనియన్ నాయకులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. భవననిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని , గత ఐదేళ్లుగా బోర్డులో పెండింగులో ఉన్న క్లయిములను పరిష్కరించాలని, వెల్ఫేర్ బోర్డును పటిష్టం చేసి పాత సభ్యత్వాల పునరుద్ధరణ , కొత్త సభ్యుల నమోదు కొనసాగించాలని యూనియన్ నాయకులు ఆ వినతిపత్రంలో కోరారు. గత ప్రభుత్వం దారి మళ్లించిన నిధులను తిరిగి బోర్డుకు జమ చేయాలని, వృద్ధులైన కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నుండి పింఛను ఇవ్వాలని కోరారు. వెల్ఫేర్ బోర్డు సభ్యులుగా ఉండి మృతి చెందిన కార్మిక కుటుంబాలను ఆదుకోవడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ భవననిర్మాణ కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పారు.కార్యక్రమంలో ఏరియా భవననిర్మాణ కార్మికసంఘం అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్ , కార్యనిర్వాహక అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, కార్యదర్శి అత్తిలి బాబీ, కోశాధికారి కోడే సాయి బాలాజీ,

భవననిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ , జిల్లా ఉపాధ్యక్షులు అంకం భాస్కరరావు , యూనియన్ నాయకులు శెట్టి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం కల్పించండి

- తహసీల్దార్ కు విన్నవించిన బి.ఎల్.ఓలు

జగ్గంపేట, పెన్ పవర్, జూలై 5 : జగ్గంపేట నియోజకవర్గంలో జగ్గంపేట మండలంలో బి.ఎల్.ఓలుగా పనిచేస్తున్న వివిధ గ్రామాల సచివాలయ ఉద్యోగులు మరియు రెవెన్యూ ఉద్యోగులు శుక్రవారం జగ్గంపేట తహసీల్దార్ ను కలిసి గౌరవ వేతనం కల్పించాలని వినపత్రం అందజేశారు. గత మూడు సంవత్సరాలుగా బి.ఎల్.ఓలుగా పని చేసిన ఉద్యోగులు ఎవరికి కూడా గౌరవ వేతనం, స్టేషనరీ ఖర్చులు, ఎన్నికల ముందు తర్వాత రోజు విధులు నిర్వర్తించినందుకు టీఏ, డీఏలు, జీతభత్యాలు అందలేదని తహసీల్దారుకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 5:అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలకు, గర్భిణులకు ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారాని శుక్రవారం కూటమి నాయకులు అందజేశారు. కూటమి నాయకులు నరిశే సోమేశ్వరావు, వర్తనపల్లి కాశీ, రౌతు సోమరాజు ఈ పౌష్టికాహారం అందజేసే కార్యక్రమాల్లో పాల్గొ న్నారు. నరిశే సోమేశ్వ రావు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులతో మంచి పౌష్టికాహారం గర్భవతులైన మహిళలకి ఇస్తున్నారని తెలిపారు. వాటిని అంగన్వాడి టీచర్లు గర్భవతులను గుర్తించి వారికి అందేలా చూడాలని కోరారు. స్థానిక శాసనస భ్యులు బొలిశెట్టి శ్రీను నిజాయితీగా అందరికి క్వాలిటీ తో కూడిన పౌష్టికాహారం ఇవ్వాలని సూచించారని చెప్పారు.అలా కాకుండా నాణ్యత లేకుండా చేస్తే కాంట్రాక్టర్ ను సస్పెండ్ చేస్తామని తెలిపారని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు యవర్న సోమశంకర్, నాగేంద్ర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో సి.సి.ఆర్.సి కార్డులు అందజేయాలి

జగ్గంపేట, పెన్ పవర్, జూలై 5 : రైతులందరికీ సకాలంలో సి.సి.ఆర్.సి కార్డులు అందజేసి ప్రభుత్వం ద్వారా వచ్చే వ్యవసాయ పథకాలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని పెద్దాపురం రెవిన్యూ డివిజనల్ అధికారి సీతారామరావు తెలిపారు. శుక్రవారం ఆయన జగ్గంపేట తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కౌలు రైతులకు అందించే సి.సి.ఆర్.సి కార్డులు మరియు సుమోటో క్యాస్ట్, ఇన్కమ్ సర్టిఫికెట్లు ప్రోగ్రెస్ పై సమీక్ష నిర్వహించారు. అదే విధంగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఇంతియాజ్ పాషా, డిప్యూటీ తహశీల్దార్ నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టంట్, వీఆర్వోలు పాల్గొన్నారు.

తప్పొప్పులన్నీ బహిరంగంగా తేల్చుకుందాం

- తనపై వచ్చిన ఆరోపణలను తీవ్రంగా ఖండించిన యేసు

జగ్గంపేట, పెన్ పవర్, జూలై 5 : పార్టీ నుంచి ఎవరో తీయడం కాదని మెజార్టీగా ఉన్న రాష్ట్ర కమిటీ అంతా చంద్రన్న వర్గంతో విడిపోయి పార్టీ నుంచి బయటకు వచ్చేశామని ఐ.ఎఫ్.టీ.యూ రాష్ట్ర అధ్యక్షుడు మరుకుర్తి యేసు అన్నారు. శుక్రవారం జగ్గంపేట మండలం రామవరం భగత్ సింగ్ నగర్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మరుకుర్తి యేసు మాట్లాడుతూ తనను పార్టీ నుంచి ఎన్నిసార్లు బహిష్కరిస్తారని తానెప్పుడో పార్టీ నుంచి బయటకు వచ్చేశామని వేరుగా సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ తూర్పుగోదావరి జిల్లా కమిటీ నియమించుకోగా తనను జిల్లా సెక్రటరీగా ఎన్నుకున్నారన్నారు. విప్లవకారులు అంటే ఇలాంటి చెత్తరాజకీయాలు చేయడంకాదని కార్మికులు, కర్షకులకు ఏం చేయాలనే ఆలోచనతో ఉండాలని అవన్నీ మానేసి బురదజల్లే రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తనవైపు తప్పు ఉందని విమర్శిస్తున్నారని చిత్తశుద్ధి ఉంటే పార్టీ కార్యాలయంలో పెద్దలు, మీడియా సమక్షంలో తేల్చుకుందామని మరుకుర్తి యేసు సవాల్ విసిరారు. అనేక రకాల తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. చీకట్ల వెంకటేశ్వరరావు అనే వ్యక్తి రైసు మిల్లుల నుంచి వచ్చే ఫండ్స్, కార్మికుల సభ్య త్వాలు ఏనాడు పార్టీకి చూపించలేదని అలాంటి వ్యక్తి కూడా తనను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నా రు. గతంలో చీకట్లను పార్టీ నుంచి బహిష్కరిస్తే తామే మళ్లీ పార్టీలోకి తీసుకొచ్చామన్నారు. మట్టిమాఫియా అని తనను విమర్శించే వారికి అక్కడ ఉన్న సమస్య ఏంటో స్థానికులు తెలుసన్నారు. జగ్గంపేటలో ఒక మహిళా కూలీకి రూ.400 వరకు వేతనం వస్తుందని పురుషుడికి రూ.450 ఉందని తెలంగాణలో రూ.300, రూ.350 కూలీలు మాత్రమే ఇస్తున్నారని దీని బట్టి ఎవరు యాజమాన్యాలకు లొంగిపోయారో తెలుస్తుందన్నారు. జగ్గంపేటలో ఉన్న ఒక్క పెంకులుమిల్లులో ఏం దోచేస్తామని వచ్చిన సభ్యత్వాలన్నీ కూడా పార్టీకే అప్పజెప్పామన్నారు. పార్టీ నాయకుడు రాజారావు చనిపోతే తక్షణమే డబ్బు సమకూర్చింది. తామేనని స్పష్టం చేశారు. పార్టీ ఆఫీసుకు రాకపోవడంతో తానేదో తప్పు చేశానని ప్రచారం చేస్తున్నారని, పార్టీ నుంచి విడిపోయాం కాబట్టి గొడవలు ఇష్టం లేక ఆఫీసుకు రావడంలేదని అంతేకానీ ఎవరికో భయపడి కాదని, అయినా స్థానిక నాయకులంతా నిర్ణయం తీసుకున్నామని పార్టీ ఆఫీసులోనే తేల్చుకుంటామని యేసు వివరించారు. తమ నాయకత్వం వెనుక జనాలున్నారని ఆజనాన్నీ ఏదోవిధంగా మభ్య పెట్టాలని చూస్తున్నారన్నారు. బెదిరింపులకు దిగడం సమంజసం కాదన్నారు. విబేదాలు ఎందుకు వచ్చాయో వాళ్లకి తెలుసునని వాటన్నింటినీ ప్రజల మధ్యలోకి తీసుకెళ్లి పార్టీని బలహీనపరస్తూ జనాల్లో పలుచనవుతున్నారన్నారు. ఈనెల 9వతేదీన జగ్గంపేటలో ఐ.ఎఫ్.టీ.యూ రాష్ట్ర కౌన్సిల్ జరుగుతుందని అది జరగకుండా చేయడానికి ఈ ఎత్తుగడలు వేస్తున్నారని తనపై చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలని యేసు తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో పీవైఎల్ జిల్లా నాయకులు గంటా బాలరాజు, భగత్ సింగ్ నగర్ వాసులు బడ్డుకొండ వెంకటరమణ, భద్రం, కనకారావు, సంతూర్, రాజు, గంగ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపులను తనిఖీ చేసిన ప్రత్యేక బృందం.

అమలాపురం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జూలై 5: నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతులకు అందచేయు ఉదేశ్యంతో వ్యవసాయ ప్రత్యేక కమిషనర్, ఆంధ్రప్రదేశ్, గుంటూరు వారి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని వ్యవసాయి విత్తనాల, ఎరువుల, పురుగుమందుల షాపులను తనిఖీ చేయుటకు ప్రత్యేక తనిఖీబృందాలను ఏర్పాటు చేసి వివిధ జిల్లాలకు పంపించడం జరిగినది. అందులో భాగంగా ది 05-07-2024 తేదిన డా? బి. ఆర్. అంబేద్కర్ కొనసీమ జిల్లాకు వచ్చిన తనిఖీ బృందంలో శ్రీకాకుళం జిల్లా పలాస సహాయ వ్యవసాయ సంచాలకులు ఎల్. వి. మధు, విజిలెన్స్ సి.ఐ లక్ష్మాజీ వారు అమలాపురం, అల్లవరం మండలాలలో తనిఖీ చేయడం జరిగింది. ఈ తనిఖీలలో, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల షాపులలోని లైసెన్సులు, రికార్డులు, స్టాకులు, మొదలగునవి తనిఖీ చేసి, రు.0.94 లక్షలు విలువ చేసే 41.150 లీటర్ల పురుగుమందు విక్రయాలను నిలిపి వేయడమైనది. ఈ కార్యక్రమంలో అమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. ఏ. షంసి, అమలాపురం మండల వ్యవసాయాధికారి కె. ధర్మ ప్రసాద్ మరియు అల్లవరం మండల వ్యవసాయాధికారి ఎన్. వి. వి. సత్యనారాయణ పాల్గొన్నారు.

సంపూర్ణ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

వై రామవరం, పెన్ పవర్, జూలై 5 : మండల కేంద్రమైన వైరామవరంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సంపూర్ణ అభియాన్ కార్యక్రమములో రంపచోడవరం ఎమ్మెల్యే ఎం. శిరీష దేవి పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించబడుతున్న నీతి అయోగ్ లో భాగంగా సంపూర్ణ అభియాన్ కార్యక్రమానికి వైరామవరం మండలాన్ని ఎంపిక చేయడం హర్షించదగిన విషయం అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆరోగ్యం,పోషకాహారం, సంక్షేమం పై ఎమ్మెల్యే అవగాహన కల్పించారు. రంపచోడవరం డివిజన్లోని అభివృద్ధికి నోచుకోని మారేడుమిల్లి, గంగవరం, వై రామవరం మండలాలను ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థిను ల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముందుగా విద్యార్థినీలతో ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి హాజరైన అందరితో పరిశుభ్రత సంపూర్ణ ఆరోగ్యం పై ప్రతిజ్ఞ చేయించారు. నీతి అయోగ్ సంపూర్ణ అభియాన్ కార్యక్రమం దేశంలో 500 బ్లాక్ లు ఎంపిక కాగా, రాష్ట్రంలో 15 మండలాలు ఎంపిక అయ్యాయని, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మూడు మండలాలు ఎంపిక అయ్యాయని మండల కోఆర్డినేటర్ కె. బాపన్న దొర తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు విజయ భాస్కర్, వై రామవరం ఎంపీపీ కే ఆనంద్ ,జడ్పీటీసీ, ఎంపీటీసీలు,సర్పంచులు, నీతి అయోగ్ నోడల్ అధికారి సూర్యతేజ, మండల కోఆర్డినేటర్ హెప్సిబా వెనీలా, మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బలుసులమ్మ ఆశీస్సులుండాలి

తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూలై 5: బలుసులమ్మ చల్లని ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని బలుసులమ్మ ఆలయం వద్ద ప్రతి శుక్రవారం నిర్వహించే అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో వచ్చే ఏడాది జాతర జరుపుకునేందుకు సన్నాహాలు చేస్తామని స్పష్టం చేశారు. పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు త్వరలోనే నూతన కమిటీ ఏర్పాటు చేసుకుందామ న్నారు. అన్న సమారాధన ఏర్పాటుకు సహకరించిన నీతారామయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పూర్వపు బలుసులమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువ నాయకులు విక్రమాదిత్యను కలిసిన సిఐ, ఎస్ఐ

తాళ్ళపూడి, పెన్ పవర్, జూలై 5:తెలుగుదేశం పార్టీ యువ నాయకులు అల్లూరి విక్రమాదిత్యని అన్నదేవరపేటలోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్చాలు అందజేసిన కొవ్వూరు రూరల్ సిఐ శ్రీనివాస్, తాళ్లపూడి ఎస్ఐ శ్యామ్ సుందర్. ఈ కార్యక్రమంలో టీడీపీ తాళ్లపూడి మాజీ ఎంపీటీసీ పెదపాటి కృష్ణ మోహన్, పైడిమెట్ట ఎత్తిపోతల పథకం అధ్యక్షులు ముళ్ళపూడి శ్రీరామచంద్ర మూర్తి, తొండేపు భరత్, ఇంజరపు అబ్బు, ఎలుగుబంటి రఘు తదితరులు ఉన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 5: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో పాటు గుణాత్మక విద్యను బోధించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆత్రేయపురం మండల ఎంఈఓ 1 వరప్రసాద్, ఎంఈఓ 2 మచ్చాసాహెబ్ లు అన్నారు. మండలంలో మెర్లపాలెం, తాడిపూడి గ్రామాలను పర్యటించి నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులను కలసి చైతన్యం చేసి ప్రభుత్వ పాఠశాలలో నూతన విద్యార్థులు జాయిన్ అయ్యేలా స్థానిక ఉపాధ్యాయులతో కలిసి క్యాంపెయిన్ చేశారు. ఈ సందర్భంగా మెర్లపాలెం నెంబర్ వన్ ప్రాథమిక పాఠశాలలో నూతన విద్యార్థుల్ని జాయిన్ చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరిదే ప్రసాద్, చింతా శ్యామ్ కుమార్, కదలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ లో నిలిచిపోయిన ఆన్లైన్ సేవలు

వై రామవరం, పెన్ పవర్, జూలై 5 : మండల కేంద్రమైన వైరామవరంలో ఉన్న సబ్ పోస్ట్ ఆఫీస్ లో గత వారం రోజుల నుండి పోస్టల్ ఆన్లైన్ సేవలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

వై రామవరం లో ఉన్న సబ్ పోస్ట్ ఆఫీస్ ఆన్లైన్ సేవలు లేనప్పటి నుండి పనిచేస్తుందని, ప్రస్తుతం ఆన్లైన్ సేవలు రావడంతో తరచూ అవాంతరాలు ఏర్పడుతున్నాయని వినియోగదారుల ఆరోపిస్తున్నారు. రిజిస్టర్ పోస్ట్ చేయాలన్నా వై.రామవరం లో ఆన్లైన్ సేవలు లేకపోవడంతో 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న అడ్డతీగల పోస్ట్ ఆఫీస్ కి వెళ్ళవలసి వస్తుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం కాలం నుండి సబ్ పోస్ట్ మాస్టర్ ను తరచూ మారుస్తున్నారని, దీనివల్ల వినియోగదారులకు సక్రమమైన సేవలు అందడం లేదని ఆరోపిస్తున్నారు. ఆన్లైన్ పనిచేయకపోవడంతో నగదు డిపాజిట్ చేయాలన్నా, విత్ డ్రా చేయాలన్న తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. వై. రామవరం సబ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలో 12 బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ లు ఉన్నాయని తెలిపారు. వేల కొలది వినియోగదారులు గత కొంతకాలంగా ఆన్లైన్ సేవలు పని చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే ఆన్లైన్ సేవలు పునరుద్ధరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా ఎగరాలి: చినబాబు

పోడూరు, పెన్ పవర్ , జులై 5: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) 30వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని – గ్రామగ్రామాన జాతి జెండా రెపరెపలాడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పసుపులేటి చినబాబు పిలుపునిచ్చారు. ఇలపకుర్రులో శుక్రవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ రత్నరాజు అధ్యక్షతన పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చినబాబు, రత్నరాజు లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ మందా కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. మాదిగల ఐక్యతకు ఈ వేడుక నిదర్శనమన్నారు. ఎస్సీ . వర్గీకరణ లక్ష్యంగా మాదిగ సోదరులంతా కదలిరావాలన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ ఎన్డీయే కూటమికి మద్దతుగా నిలవడం, అధికారంలోకి రావడం శుభపరిణామన్నారు. కొందరు నాయకులు ఎన్నికల్లో కూటమికి వ్యతిరేకంగా పనిచేసినవారు ఉండికి చెందిన కడలి నరేష్ నరసాపురానికి చెందిన ఎం.చిట్టిబాబు, బి ప్రభాకర్, భీమవరానికి చెందిన ఎం. రాజేష్లను తొలగిస్తూ ఎమ్మార్పీఎస్ చర్యలు తీసుకుందన్నారు. వారి స్థానంలో ఎమ్మార్పీఎస్ విధానాలకు కృషి చేసిన యువతకు పదవులను ఇవ్వడం జరిగిందన్నారు. నరసాపురం

నియోజకవర్గ గౌరవ అధ్యక్ష ఉపాధ్యక్ష సభ్యులుగా కొరమంచి అశోక్ను, కొరమంచి హరిబాబు, తన్నేటి శేఖర్, పేరుపాలెం గ్రామాధ్యక్షుడిగా లక్కవరపు జకరయ్య, జిల్లా సహాయ కార్యదర్శిగా బాలం శ్రీను, పోడూరు మండల అధ్యక్షుడిగా రేచర్ల నరేంద్రబాబు నియమితులను చేస్తూ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షుడు శెట్టి జాన్సీ, సీనియర్ నాయకలు కాటూరి సువర్ణబాబు, ముసుకూడి ప్రవీణ్, ఉల్లంపర్తి ప్రభాకర్, సిద్దిల గాంధీ. ముసుకూడి సుదర్శనరావు, తన్నేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా పై అవగాహన కలిగి ఉండండి

గోకవరం, పెన్ పవర్, జులై 05: డయేరియా వ్యాధి పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం గోవింద్ అన్నారు. శుక్రవారం నాడు ఐకెపి కార్యాలయం నందు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించడం జరిగింది దీనికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో గోవిందు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ప్రతి ఒక్కరికి డయేరియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని అలాగే గ్రామాల్లోని నీటి కుంటలు కట్ట ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. మురికి నీళ్లు ఉన్న దగ్గర బ్లీచింగ్ చల్లే విధంగా అన్ని శాఖలు సమన్వయంతో చూడాలన్నారు. అనంతరం జి.కొత్తపల్లి ఆసుపత్రి వైద్యాధికారి డా.తిరన్ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు అందరకీ డయోరియా లక్షణాలు, చికిత్స, తీసుకోవలసిన జాగ్రత్తలు, జింక్ , ఓఆర్ఎస్ వినియోగం వంటి అంశాలనుగురించి వివరించారు. పరిసరాల పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, క్లోరినేషన్ వంటి అంశాలను గురించి వివరించి చెప్పారు. అంగన్వాడీ సెంటర్లలో చిన్నపిల్లలకు కాచి చల్లార్చిన నీటినివ్వాలని, ఆహారపదార్థాలు వేడిగా వున్నపుడే పిల్లలు తినేలా చూడాలని , గోళ్లు పరిశుభ్రంగా ఉంచుకోవడం, హ్యాండ్ వాష్ వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం డయోరియా నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ పి.వరలక్ష్మి , సీనియర్ సూపర్ వైజర్ ఇందిరా ఎం పి హెచ్ ఓ శంకర్, హెచ్ వి పి.ఇందిరా రాణి, పి.చంద్రమ్మ, ఎల్.రజని, హెల్త్ అసిస్టెంట్ పవన్, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

వైభవంగా సూర్యదేవుని గ్రామోత్సవం

గోకవరం, పెన్ పవర్, జులై 05 : మండలంలో శివరామపట్నం గ్రామంలో సనాతన ధర్మ ప్రబోధనా స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో ఉషా పద్మినీ ఛాయా సమేత శ్రీ సూర్యనారాయణ స్వామివారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో గ్రామస్తులందరూ పాల్గొని ప్రతి ఇంటి వద్ద స్వామివారికి భక్తి శ్రద్ధలతో పుష్పమాలలు నీరాజనాలు సమర్పించారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబా, ఉపాధ్యక్షులు అక్షింతల రాజా ప్రధాన కార్యదర్శి దోసపాటి సుబ్బారావు మాట్లాడుతూ మానవుని కార్యసిద్ధికి పురుష ప్రయత్నంతో పాటుగా భగవంతుని అనుగ్రహం తోడవ్వాలని అప్పుడే కార్యం పరిపూర్ణంగా సఫలీకృతం అవుతుందని అన్నారు. ప్రజలందరికీ భగవంతుని దివ్య ఆశీస్సులు లభించాలనే కారణంతో ప్రతి పల్లెలో సూర్యదేవుని గ్రామోత్సవాలు నిర్వహిస్తుమన్నారు.

ఈ కార్యక్రమంలో పిల్లంగోరు పాపారావు, పెదిరెడ్ల రాంబాబు, ములగాడ గనిలక్ష్మి, జోకా వెంకట్రాజు, నారిపిరెడ్డి వీరలక్ష్మి, కరణం సూర్యావతి, బట్టా దొరబాబు, మండపాక సత్తిపండు, గాబు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి రూ.10,000 ఆర్థిక సాయం

పోడూరు, పెన్ పవర్, జులై 5: పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన సాయి దుర్గా శ్రీనివాసరావు 17 ఇతనికి నరాల బలహీనత వలన రక్తం లేక తరచుగా ఫీట్స్ వ్యాధి వచ్చి చాలా బాధపడుతున్నాడు ఇతనికి వైద్యం చేయించుకోవడానికి కూడా ఆర్థిక స్తోమత లేదు చాలా చిన్న కుటుంబం ఈ విషయాన్ని వసుధ ఫౌండేషన్ చైర్మన్ వెంకటరామరాజు గారికి తెలియజేయగా వెంటనే వారు స్పందించి పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని చెక్కుగా పంపించినారు ఆ చెక్కును ఈరోజు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పి బుద్ధరాజు జిన్నూరు గ్రామంలో గల పి బాపిరాజు భవనమునందు జరుగుతున్న టైలరింగ్ యూనిట్ సభ్యుల సమక్షంలో చెక్కును అందజేయడం జరిగినది ఈ సహాయానికి శ్రీనివాస్ తల్లితండ్రులు వసుధ ఫౌండేషన్ చైర్మన్ శ్రీ మంతెన వెంకటరామరాజు గారికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు ఈ కార్యక్రమంలో టైలరింగ్ ట్రైనింగ్ టీచర్ బి అరుణ పాల్గొన్నారు

మార్టేరు మావుళ్ళమ్మ సంబరాలు వైభవం గా జరిగాయి

పెనుమంట్ర,పెన్ పవర్, జూలై-05: మండలంలోని మార్టేరులో వేంచేసియున్న కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజుల్లుతున్న శ్రీ రావుళ్ళమ్మ వారి 110వ సంబర మహోత్సవాలు అంగరంగా వైభవంగా సాగాయి. తెల్లవారుజాము నుండే భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మ్రొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి కాళికా ప్రభ ఊరేగింపుకు భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి పిల్లలు, పెద్దలు అమ్మవారి ప్రభను తమపై నుండి దాటించుకున్నారు. ఇలా దాటించుకుంటే అమ్మవారి కరుణాకటాక్షములు కలుగుతాయని భక్తులు ప్రగాఢ విశ్వాసంగా భావిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాళికామాత నృత్యాలు, దేవి నృత్యాలు, గరగనత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామంలోని అన్ని విధులు పెద్ద ఎత్తున ఊరేగింపు శోభ సంతరించుకుంది.

ఘనంగా పద్దాలమ్మ వార్షికోత్సవ వేడుకలు

పెద్దాపురం, పెన్ పవర్, జూలై 5 : భక్తుల పాలిట కొంగు బంగారంలా విరాజిల్లుతూ మండల పరిధిలోని కట్టమూరు గ్రామంలో కొలువైఉన్న పద్దాలమ్మ అమ్మవారి ఆరవ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం వైభోపేతంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు, అభిషేకాలు, హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ నెల 7న దండోరా జెండా ఆవిష్కరణ చేపట్టాలి

- అల్లూరి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు డాక్టర్ చిన్న బాబు

గంగవరం ,పెన్ పవర్, జూలై 5: ఈనెల ఏడో తేదీన జిల్లాలో గల ప్రతి గ్రామంలో మాదిగ దండోరా జండా ఆవిష్కరణ కవాతు నిర్వహించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నిడమర్తి చిన్నబాబు సూచించారు .ఈనెల 7 నాటికి మాదిగ దండోరా ఉద్యమం మొదలై 30 సంవత్సరాల పూర్తి చేసిన నేపథ్యంలో అలాగే అభినవ అంబేద్కర్ దళితుల పాలిట ఆశాజ్యోతి మందకృష్ణ మాదిగ పుట్టినరోజు నేపథ్యంలో దండోరా జెండాలను ఆవిష్కరించి, గ్రామాల్లో కవాతు నిర్వహించాలన్నారు. అలాగే దండోరా ఉద్యమం 30 సంవత్సరాల సుదీర్ఘమైన పోరాటంలో అసువులు బాసిన మాదిగ బిడ్డలను స్మరించుకొని నివాళులర్పించాలన్నారు .ఈ కార్యక్రమం విజయవంతం జిల్లాలోని ఎమ్మార్పీఎస్ సభ్యులందరూ సహకరించాలని ఆయన కోరారు.

ఎంపీడీవో రత్నరాజుకి ఘన సన్మానం

కాజులూరు,పెన్పవర్,జూలై5: కాజులూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సేవలందిస్తున్న ఇంజేటి రత్నరాజు పదవీవిరమణ చేయడంతో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు,మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది రత్నరాజు దంపతులను ఘనంగా సన్మానించారు.ఈనేపథ్యంలో కార్యాలయ సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులు,గ్రేడ్-5,6,ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు,వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరుల ఆధ్వర్యంలో పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ముందుగా ఈవోపీఆర్డీ వివిఎస్ఆర్కె కొండలరావు,ఆర్.డబ్ల్యూఎస్ జేఈ ప్రసాద్,పంచాయతీరాజ్ జేఈ భవానీ శంకరరావుతదితరులు ఎంపీడీవో ఐ రత్నరాజు దంపతులకు జ్ఞాపికలు అందజేసి,శాలువాలతో ఘనంగా సన్మానించి,పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.ముందుగా పంచాయతీ విస్తరణాధికారి కొండలరావు మాట్లాడుతూ నేను ఎన్నికల నేపథ్యంలో ఇక్కడకి రావడం జరిగింది,అయితే ఎంపీడీవో గా ఒక అధికారి ఏ విధంగా ఉంటారో అనడానికి ఆయనే తార్కాణం అన్నారు.ఆయన సిబ్బంది అందరితో చాలా కలుపుగోలుగా ఉండేవారని గుర్తుచేశారు.ఎవరినీ నొప్పించకుండా పనిభారం ఉన్నప్పటికీ ఎవరిపైనా ఒత్తిడి పెట్టకుండా ఆయన పని ముగించుకుని వెళ్లేవారన్నారు. అనంతరం హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉన్నతాధికారులనుంచి వర్క్నిమిత్తం ఒత్తిడి వచ్చినా ఎప్పడికప్పుడు ఆయనే స్వయంగా వీసీ ,సమీక్షలు తదితర అంశాలపై నోట్స్ రాసుకుని మరలా మా అందరికీ గుర్తుచేసేవారన్నారు.ఒక అధికారిగా కాకుండా తోటి ఉద్యోగిగానే ఆయన సేవలు కొనసాగాయనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు.పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణ మాట్లాడుతూ ఎంపీడీవో తో ఎన్నో అంశాలపై ప్రతీ రోజు చర్చించుకోవడం జరిగేదని,ఇంతకు ముందు చేసిన ఎండీవోలకు ,సార్ కు చాలా తేడాని గమనించామన్నారు.ఈ సమయానికి ఆఫీసులో ఉండాలని కాని, సెలవు లేదని కాని ఎవరి మనసును నొప్పించకుండా ఇతరుల పని కూడా ఆయన చేసుకోవడం విశేషం అన్నారు.అనంతరం పంచాయతీ కార్యదర్శులు,డిజిటిల్ అసిస్టెంట్లు,మహిళా పోలీసులు ఎంపీడీవో దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేసి,పూలమాలలు వేసి,శాలువాలతో ఘనంగా సత్కరించారు.అలాగే పలువురు మాట్లాడుతూ ఎంపీడీవో పంచాయతీ సిబ్బందితో రిక్వెస్ట్గానే పని చేయించారు తప్ప,ఎప్పుడూ ఆర్డర్ వేయడం గాని, కమాండ్ చేయడం గాని చేయలేదని ఆయన చేసిన సేవలను ప్రతీ ఒక్కరూ కొనియాడారు.ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జీవీశేఖర్ రెడ్డి, సీహెచ్ సూర్యప్రకాశ్, చొల్లంగి వేణుగోపాలరావు,ఎండీ జలాల్, డి.ప్రతాప్,కె.సూరిబాబు, ఎం.శ్రీనివాస్,కె.ఈశ్వరి,కె.అనంతలక్ష్మి, హేమాదేవి, పి.మహాలక్ష్మి, జి.ఉషారాణి,ఎంఈవో పి.జాన్,రెహమాన్,దేవు రామకృష్ణ,పెద్దిరెడ్డి నాగేశ్వరరావు ఇ.వీరబాబు,రమేష్, రవి,జహంగీర్,చిన్నారెడ్డి, డాక్టర్ సుప్రియ, స్వాతి,చరణ్,మైథిలి,సచివాల సిబ్బంది,రెవెన్యూసిబ్బంది,ఎన్ఆర్ఈ ఎస్ సిబ్బంది తదితరులు ఎంపీడీవో రత్నరాజుకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

గురజనాపల్లి హైస్కూలును ఆకస్మిక తనిఖీ చేసిన ఏడీ నాగేశ్వరరావు

కరప, పెన్ పవర్, జూలై 05: మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నతపాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని ప్రభుత్వ పథకాల అసిస్టెంట్ డైరక్టర్(ఏడీ) పడాల నాగేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డులు, స్టాక్, అమలుతీరును ఆయన తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వంటగదిని, టాయ్లెట్స్ పరిశీలించి, పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తగా, పరిసరాల పరిశుభ్రతపై ఆయన సూచనలు చేశారు. కిచెన్ గార్డెన్ పెంచాలని ఉపాధ్యాయులకు, భోజనపథకం నిర్వాహకులకు ఆయన సూచించారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ వంటకాలను రుచికరంగా వంటలుచేస్తూ, విద్యార్థులు నూరుశాతం మధ్యాహ్న భోజనం తినేలా చూడాలన్నారు. అనంతరం ఏడీ నాగేశ్వరరావు మధ్యాహ్న భోజనపథకంలో పాల్గొనే విద్యార్థులకు వడ్డనచేసి, విద్యార్థులతో కల్సి సహపంక్తి భోజనం చేశారు. హెచ్ఎం ఎ.సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, పీడీ నాగలింగేశ్వరరావు, ఉపాధ్యాయులు వీవీ రమణమూర్తి, ఎ. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించండి

గోకవరం, పెన్ పవర్, జులై 05: స్థానిక దేవి సెంటర్లో వెలిసినటువంటి కనకదుర్గ అమ్మవారి తీర్థ ప్రసాదాలు ప్రతి ఒక్కరు స్వీకరించాలని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. గత కొన్నేళ్ళుగా ప్రతి శుక్రవారం దేవి చౌక్ శ్రీ కనక దుర్గమ్మ ఆలయంలో 50 కేజీల పులిహోర, డ్రైవర్స్ కాలనీ వెలిసిన శ్రీ కనక దుర్గ అమ్మ వారి ఆలయం లోను, గాదెలపాలెం గ్రామంలో వెలిసిన శ్రీ కనక దుర్గమ్మ అమ్మ వారి ఆలయం లోను, దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామంలోని శ్రీ కనక దుర్గమ్మ ఆలయంలో పులిహోర ప్రసాదాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి భక్తులకు వితరణ చేస్తున్నట్లు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. ఆయా గ్రామాల భక్తులందరూ అమ్మవారి తీర్థ ప్రసాదాలు తప్పకుండా స్వీకరించాలని ఆయన కోరారు. అమ్మవారి చల్లని ఆశీస్సులతో వారం వారం ఈ కార్యక్రమాలు జరుపుతూనే ఉంటానని తెలిపారు. కంబాల శ్రీనివాసరావు సంకల్పంతో రూపుదిద్దుకుంటున్న గోకవరం దేవి చౌక్ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి స్వర్ణ రత్న ఖచిత కిరీటానికి గోకవరం గ్రామస్తులు పోసిన సత్యనారాయణ సూర్యవతి దంపతులు రూ.5116 విరాళంగా ఇచ్చారు. వారికి రామసేన, దేవిచౌక్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్న దొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాధ రావు శర్మ, దేవి చౌక్ సేవకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి కౌలు రైతు కు సి సి ఆర్ సి కార్డ్ ఇవ్వాలి: ఆర్డీవో సీతారామరావు.

ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 5: అర్హులైన ప్రతి కౌలు రైతుకు సిసిఆర్సి కార్డు, సుమోటో కుల ధ్రువీకరణ పత్రములు ఇవ్వాలని పెద్దాపురం ఆర్డీవో సీతారామరావు మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం లో సిసిఆర్సి కార్డులు (కౌలు రైతు కార్డులు), సుమోటో కుల దృవీకరణ పత్రములు త్వరిత గతిని మంజూరు విషయమై సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యముగా సి సి ఆర్ సి(కౌలు కార్డులు) మంజూరుకు గ్రామ రెవెన్యూ అధికారులు అందరూ వారి వారి గ్రామంలలో సి సి ఆర్ సి(కౌలు కార్డులు) పై పూర్తి అవగాహన కల్పించాలని తదుపరి అర్హులైన ప్రతి రైతుకు కౌలు కార్డులు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే సుమోటో కుల దృవీకరణ పత్రములు పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలని అన్నారు. ఈ సమావేశములో మండల తహసిల్దార్ వై రంగారావు , మండల అగ్రి కల్చర్ అధికారిణి బి. జ్యోతి ,మండల డిప్యూటీ తహసిల్దార్ గంధం రవి, గ్రామ రెవెన్యూ అధికారులు ఎ.కిషోర్, రొంగల శ్రీను ,కె.సత్యారావు ,బి చిన్నారి, శ్యామల ,తిరుపతమ్మ , వీఆర్వోలు , గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ లు(వి ఏ ఏ) లు పాల్గొన్నారు.

9న మండల సర్వసభ్య సమావేశం

రంగంపేట,పెన్ పవర్, జులై 05: మండలంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9న సర్వ సభ సమావేశం జరుగునని ఇంచార్జ్ ఎంపీడీవో పి.వెంకటరత్నం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల తొమ్మిదో తేదీన ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఆయా శాఖలపై సమీక్ష ఉంటుందని అధికారులు అందరూ పూర్తి సమగ్ర నివేదికతో హాజరుకావాలని ఇంచార్జ్ ఎంపీడీవో పి. వెంకటరత్నం సూచించారు.

నేడు ప్రపంచ సంక్రమిత వ్యాధుల దినోత్సవం

గంగవరం, పెన్ పవర్, జూలై 5: జంతువుల తో మానవుల సహచర్యం ఏంతో ప్రాచీణమైనది ప్రతీ మనిషి పశు పశుపక్షదుల నుండి ఉత్పత్తి అయ్యే పాలు, గ్రుడ్డు, మాంసం పై ఆధారపడి యున్నారు మనుషులు పశువుల సహచర్యం లో వచ్చే వ్యాధులనే సంక్రమిత వ్యాధులు అంటారని నెల్లిపూడి గ్రామీణ పశు వైద్యశాల జూనియర్ వెటర్నరీ అధికారిపి. అప్పన్న బాబు తెలిపారు. ఈనెల 6న జూనోసిస్ డే సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సంక్రమిత (జూనోటిక్)వ్యాధులు అనగా పశువుల నుండి మనుషులకు, మనుషుల నుండి పశువులకు వ్యాప్తి చెందే వ్యాధులను సంఖ్య 280 గా శాస్త్రవేత్తలు గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో ముఖ్యంగా ప్రాణంతకమైన వ్యాధి పిచ్చికుక్క కరిస్తే వచ్చే " రేబిస్ " వ్యాధి కి మొట్టమొదటగా 1885 జులై 6 న పిచ్చి కుక్క కరిచిన బాలునికి లూయిస్ పాచ్చర్ అనే శాత్రవేత్త వ్యాధి రాకుండా వ్యాధి నిరోధక టీకా విజయవంతం గా నిర్వహించడంవలన ప్రతీ సంవత్సరం జులై '6 తేదీన జూనోసిస్ డే జరిపి ఆరోజు పెంపుడు కుక్కలకు పశువైద్య శాల యందు ఉచితము గా ఏంటి రేబిస్ టీకాలను వేస్తారని పెంపుడు కుక్కల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు. పెంపుడు జంతువుల పెంపకం ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ నేపథ్యంలో శనివారం మండలంలోని గంగవరం నెల్లిపూడి మొల్లేరు పశు వైద్యశాలలో ఏ ఆర్ వి వ్యాక్సిన్లు అందించడం జరుగుతుందన్నారు.

గోల్డెన్ స్కూల్ అవార్డు పొందిన భాష్యం స్కూల్

పెనుమంట్ర, పెన్ పవర్,జూలై-05: పెనుగొండ భాష్యం పాఠశాలకు 2023-24 విద్యా సం.గాను గోల్డెన్ స్కూల్ అవార్డు లభించింది. ముంబైకి చెందిన ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ వారు దశలవారీగా నిర్వహించిన పోటీ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ, ఫిబ్రవరి నెలలో జరిగిన ఫైనల్ టెస్ట్ లో తమ విద్యార్థులు జాతీయస్థాయిలో టాపర్లగా నిలిచారని ప్రిన్సిపల్ ఎన్ వి అప్పారావు గారు తెలిపారు. స్టేట్ టాపర్లగా నిలిచి, గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలు, మరియు నగదు పొందిన కొవ్వూరి కళ్యాణ్ శ్రీ సాయి ఆదిరెడ్డి 3వ తరగతి (గణితం), మండేలా వరుణ్ 7వ తరగతి (గణితం), ఇందుగుమల్లి లక్ష్మీ ప్రసన్న 8వ తరగతి (సైన్స్)లను, ఎక్సలెన్స్ మెడల్ అవార్డ్ పొందిన జనార్దన్ రిత్విక్ మైలే, కందుల వాగ్దేవి, రోచర్ల మనోజ్ సాయి కుమార్, కుసుమే అనన్య, బాగు సాయి వెంకటరామ్ సుశ్విత్, మారుమూడి శామ్యూల్ సత్యాష్ లను ప్రత్యేక అభినందనలతో అభినందించారు. వీరితోపాటు ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు పాల్గొన్నటువంటి విద్యార్థులలో 20 బంగారు పతకాలను, 20 రజత పతకాలను, 20 కాంస్య పతకాలను కైవసం చేసుకున్న విద్యార్థులను కూడా అభినందించారు. విద్యార్థుల అద్భుత విజయానికి కారణం చక్కని క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన, నైపుణ్యులు అయినా ఉపాధ్యాయుల పర్యవేక్షణ, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహాయ సహకారాలే అన్నారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల అధినేత శ్రీ భాష్యం రామకృష్ణ, భాష్యం జోనల్ ఇన్చార్జి ఏ శ్రీమన్నారాయణ రెడ్డి, చాంప్స్ ఇంచార్జ్ శ్రీమతి రాణీ రోజాజీ, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నీతి అయోగ్ సంపూర్ణ అభియాన్ అవగాహన సదస్సు-ఎంపీడీవో శ్రీనివాసులు

గంగవరం, పెన్ పవర్, జూలై 5: ఈనెల 6న గంగవరంలో నీతి అయోగ్ సంపూర్ణ అభియాన్ కార్యక్రమం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్ ద్వారా చేపట్టే కార్యక్రమాలైన ఆరోగ్యం, పోషకాహారం, సంక్షేమం అంశాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవగాహన సదస్సుకు మండలంలోని ప్రజా ప్రతినిధులు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

ఉచిత రేబీస్ వ్యాధి నిరోధక టీకాలను వినియోగించుకోవాలి

పోడూరు, పెన్ పవర్, జూలై 5: జులై 6న ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం పోడూరు మండలములోని జిన్నూరు, పండితవిల్లూరు.. పోడూరు, పెనుమదం పశు వైద్యశాల్లో పంపుడు కుక్కలకు ఉచితముగా "రేబిస్ వ్యాధి" నిరోధక టీకాలు వేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పోడూరు మండల పశువైద్య శాఖ అధికారి ఎస్ మహేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కుక్కల నుంచి మనుషులకు, పశువులకు వ్యాధి సోకుతుందన్నారు రేబిస్ వ్యాధి కుక్క కాటు వలన సంక్రమించే అవకాశము ఉన్నందున కుక్కల యజమానులు తమ పెంపుడు కుక్కలకు సమీప పశువైద్యశాల నందు టీకాలు వేయించుకోవలసినదని ఆయన కోరారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ.

ఆలమూరు, పెన్ పవర్, జూలై 05: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఆలమూరు మండలంలోని జొన్నాడ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు తాడి శ్రీనివాస్ రెడ్డి(బట్టి శ్రీను), గొడవర్తి దుర్గాప్రసాద్ (బాబి) అన్నారు. వారి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తమ సొంత నిధులతో ఉచిత నోటు పుస్తకాలు, కిట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యం నుండే చదువులు సక్రమంగా కొనసాగితే పిల్లల భవిష్యత్తు బాగుంటుందని,ఏ విద్యార్థి కూడా డ్రాప్ అవుట్ కాకుండా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను బడిలో చేర్పించాలన్నారు.అలాగే మధ్యాహ్నం మెనూ ప్రకారం సక్రమంగా రుచికరమైన భోజనాన్ని చిన్నారులకు అందించాలన్నారు. పాఠశాల పరిసర ప్రాంతాలను, త్రాగునీటిని పరిశుభ్రంగా ఉంచుతూ డయేరియా వంటి తదితర వర్షాకాల సీజన్‌లో వచ్చే వ్యాధులు పట్ల ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు విద్యార్థులను గమనించాలన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని పలు ఉపాధ్యాయులు కొనియాడారు. మల్లిడి సూర్యనారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

నగర సుందరీకరణకు సహకరించండి

కార్పొరేట్ సంస్థలకు కమిషనర్ వినతి

కాకినాడ.పెన్ పవర్ జులై 5 : నగర సుందరీకరణకు కార్పొరేట్ సంస్థలు తోడ్పాటు నందించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అయన నగరపాలక సంస్థ కార్యాలయం లో ఓఎన్జిసి,ఎన్ ఎఫ్ సి ఎల్, కే ఎస్ పి ఎల్ వంటి కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటరావు మాట్లాడుతూ సామర్లకోట రోడ్డు, అక్షర స్కూల్ రోడ్డు సహా పలు ప్రాంతాలలో రహదారులకు ఇరువైపులా ఇళ్ల లోని చెత్తను, చిరు వ్యాపారులు కొబ్బరి బొండాల వ్యర్థాలను వేస్తున్నారన్నారు. దీనివల్ల ఆయా ప్రాంతాలు అద్వాన్నంగామారుతున్నాయన్నారు.ఇందువల్ల అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి దోమలకు నిలయంగా మారి వ్యాధులు ప్రబలే పరిస్థితి నెలకొంటుందన్నారు. ఇకపై అలాంటి ముఖ్య ప్రాంతాలలో చెత్తను డంప్ చేసే అవకాశం లేకుండా అక్కడ ఫెన్సింగ్ వేసి, మొక్కలు నాటి సుందరీకరణ చేయాలని సంకల్పిస్తున్నామన్నారు. ఇందుకు ఆయా కార్పొరేట్ సంస్థలు తమ సి ఎస్ ఆర్ నిధుల ద్వారా అవసరమైన తోడ్పాటు అందించాలని కమిషనర్ కోరారు. కమిషనర్ ప్రతిపాదనపై సమావేశానికి హాజరైన ఆయా సంస్థల ప్రతినిధులు కూడా సానుకూలంగా స్పందించారు. అలాగే ఆల్ ఈజ్ వెల్, ధరిత్రి వంటి సంస్థలు కూడా నగర వాతావరణాన్ని పచ్చదనంతో, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేలా మొక్కలు నాటే ప్రక్రియ లో భాగస్వాములు కావాలని కోరారు. త్వరలోనే మరో సమావేశాన్ని ఏర్పాటు చేపట్టాల్సిన పనులపై ఆయా సంస్థల ప్రతిపాదనలను స్వీకరించి నగర సుందరీకరణ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు, ఎంహెచ్వో డాక్టర్ పృద్వి చరణ్, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, ఏ ఈ వై. నాగేశ్వరరావు, శానిటరీ సూపర్వైజర్ రాంబాబు, ఆయా కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.

ఎమ్మెల్యే నెహ్రూను సత్కరించిన గండేపల్లి మండల ఫోటోగ్రఫీ యూనియన్

గండేపల్లి, పెన్ పవర్, జూలై 5 : జగ్గంపేట లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నందు జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూను గండేపల్లి మండల ఫోటోగ్రఫీ యునియన్ సభ్యులు శుక్రవారం కలిసి ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని అందిపుచ్చుకుని ప్రజలకు అందుబాటులో ఉంటున్నామన్నారు. ప్రభుత్వం ప్రతి ఫోటోగ్రఫీ మిత్రుడికి బ్యాంకు లోన్ మరియు ప్రభుత్వ రంగాలలో అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫోటోగ్రఫీ సెక్రెటరీ బెజగం కోటేశ్వరరావు, గండేపల్లి మండల ఫోటోగ్రఫీ అధ్యక్షులు ఇజ్జన రాంబాబు, మాజీ అధ్యక్షులు పెనుగడి సూరిబాబు, యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలను పరిశుభ్రం చేయండి

యజమానులకు కమిషనర్ సూచన

కాకినాడ.పెన్ పవర్ జులై 5 : ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారులను తక్షణమే తొలగించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు స్థల యజమానులను కోరారు. అలా చేయకపోతే జరిమానా విధించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన గుడారిగుంట, డి-మార్ట్, జయేంద్ర నగర్, లక్ష్మీ హాస్పిటల్ ప్రాంతాలలో డి-సిల్టేషన్ పనులను తనిఖీ చేశారు. అక్కడి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూడికతీత పనులను రానున్న నెల రోజుల్లో కూడా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని మెరుగైన పారిశుధ్య నిర్వహణ కోసం నగరపాలక సంస్థ చేస్తున్న సేవలకు ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.ముఖ్యంగా కొంతమంది నగరంలో ఖాళీ స్థలాలను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారని, ఆ స్థలాలను నిర్లక్ష్యం చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.ఆయా స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోవడం, డంపింగ్ యార్డుల్లా, దోమలకు నిలయంగా మారటం తో పాటు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా ఉంటున్నాయన్నారు . అందువల్ల ఆయా స్థల యజమానులు తక్షణమే పరిశుభ్రం చేసుకోవాలని కమిషనర్ కోరారు. ఒకవేళ అలా పరిశుభ్రం చేసుకోలేని పక్షంలో తమ పారిశుద్ధ్య విభాగాన్ని సంప్రదిస్తే స్థలాన్ని పరిశుభ్రం చేసేందుకు అయ్యే ఖర్చు వివరాలను తెలియజేస్తారని,

ఆ సొమ్మును చలానా రూపంలో నగరపాలక సంస్థకు చెల్లిస్తే కార్పొరేషన్ పరంగానే స్థలాలను పరిశుభ్రం చేస్తామన్నారు. లోతట్టు ప్రాంతంలో ఉండే స్థలాలను కూడా ఎత్తు చేసి నీరు నిలువ ఉండకుండా చదును చేసుకోవాలని సూచించారు. ఆ మేరకు స్థల యజమానులు సహకరించాలని, లేదంటే వారిపై పారిశుద్ధ్య పరమైన చట్ట ఉల్లంఘన క్రింద నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంహెచ్ఓ డాక్టర్ పృద్వి చరణ్,శానిటరీ సూపర్వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ లాజర్, ఆయా సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి హుండీల ఆదాయం లెక్కింపు.

అంతర్వేది/అమలాపురం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జూలై 5. సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామం లో వేంచేసియున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం నందు 101 రోజులకు గాను 26-03-2024 వ తారీకు నుండి 5 -07-2024 తారీకు వరకు ప్రధాన ఆలయ హుండీల ద్వారా వచ్చిన ఆదాయం 44 లక్షల 74 వేల 752 రూపాయలు గుర్రాల అక్కమ్మ హుండీ ఆదాయం 26వేల 572 రూపాయలు అన్నదానం హుండీల ద్వారా 1,09,888 రూపాయలు మొత్తం ఆదాయం 46 లక్షల 11 వేల 212 రూపాయలు ఆదాయం వచ్చిందని శ్రీ స్వామివారి అనుబంధ దేవాలయమైన నీలకంటేశ్వర స్వామి హుండీల ద్వారా 19, 452 రూపాయలు వచ్చింది హుండీ ఆదాయాల లెక్కింపు జిల్లా దేవాదాయ శాఖ అధికారి అసిస్టెంట్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు పర్యవేక్షణలో స్థానిక ఎంపీటీసీ బైరా నాగరాజు మరియు సర్పంచ్ కొండా జాన్ బాబు సమక్షంలో ఆలయ సిబ్బంది హుండీలను తెరచి లెక్కించడం జరిగింది

పంచాయతీలోపార్టీల అధినేతల ఫోటోలు ఏర్పాటు

కాజులూరు,పెన్‌పవర్,జూలై5: దేశ ప్రధాని మోదీ,టీడీపీ పార్టీ అధినేత ,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ లాంటి ప్రముఖుల చిత్రపటాలను శుక్రవారం కాజులూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయా పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు . ఈసందర్భంగా కూటమి నాయకులు సలాది వీరబాబు మాట్లాడుతూ పార్టీ అధినాయకుల చిత్రపటాలను కూటమి సభ్యులు అంతా కలిసి ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన మీడియాకు తెలిపారు.ఇలా కూమి శ్రేణుల సభ్యులు అంతా ఐక్యతగా ముందుకొచ్చి ప్రభుత్వ కార్యాలయాల్లో నేతల ఫోటోలు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈసందర్భంగా కూటమి సభ్యులకు వీరబాబు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో జనసేన, బీజేపీ, టీడీపీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి సాధించడం తద్యం

- 35వ డివిజన్ జనసేన పార్టీ ఇంచార్జ్ మనోహర్ గుప్తా
- సచివాలయానికి చంద్రబాబు పవన్ కళ్యాణ్ ల చిత్రపటాల బహుకరణ

కాకినాడ. పెన్ పవర్ జూలై 5 : కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి సాధించడం తద్యమని కాకినాడ 35వ డివిజన్ జనసేన పార్టీ ఇంచార్జ్ మనోహర్ గుప్తా అన్నారు. శుక్రవారం ఆయన కాకినాడ స్మార్ట్ సిటీ 35వ డివిజన్ సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చిత్రపటాలు సచివాలయానికి బహూకరించడం జరిగింది.ఈ సందర్భంగా మనోహర్ గుప్తా మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను నమ్మకాన్ని నిలబెట్టడానికి నూతన ప్రభుత్వం బాధ్యతగా అడుగులు వేస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి సాధించడం తద్యమని గత ప్రభుత్వం చేసిన అరాచక పాలన నుండి ప్రజలకు విముక్తి కలిగిస్తూ నూతన ప్రభుత్వం ప్రజాస్వామ్య యుతంగా పాలన అందిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ టిడిపి ఇన్చార్జ్ గోపిశెట్టి బూరయ్య, జనసైనికులు మంగమ్మ నాగార్జున,పెంటా రవితేజ షణ్ముఖ్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు గోవింద్,చంటి బాబు,ప్రసాద్ పాల్గొనడం జరిగింది.

అచ్చుతాపురంలో ప్రత్యేక పారిశుద్ధ్యం

రంగంపేట, పెన్ పవర్, జులై 05: మండలంలోని ఈలకొలను శివారు అచ్చుతాపురం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు.ఇటీవల గ్రామంలో పలువురు డయేరియా వ్యాధి బాదినపడ్డారు.డ్రైనేజీ వ్యవస్థ సరిలేక, త్రాగునీటి పైపులు లీకులు , చుట్టూ కోళ్ల ఫారం వల్లే అతిసార వ్యాధి వ్యాపించినట్లు నాయకులు గుర్తించారు. అతి సార వ్యాధి ప్రబలకుండా రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, సర్పంచ్ సిహెచ్. సత్యనారాయణ ఏకస్తులై గ్రామంలో పలు పారిశుద్ధ్య పనులు చేయించారు.వాటర్ ట్యాంక్ క్లోరిటీషన్,డ్రైనేజీలు పూడికలు తీయించారు.

గర్భిణీ స్త్రీలకు పోషకాహారం కిట్లు పంపిణీ

రంగంపేట, పెన్ పవర్, జులై 05: మండలకేంద్రమైన రంగంపేట లో అంగన్వాడి సెంటర్లో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక అంగన్వాడి సెంటర్లలో బిజెపి నాయకులు గుప్త గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహార కిట్లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణీలకు,బాలింతలకు, చిన్నపిల్లలకు పోషకాహారం స్థితిని మెరుగుపరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు పోతుల వీర వెంకట సత్యనారాయణ, జనసేన పార్టీ నాయకుడు గుండుబిల్లి వరప్రసాద్ తదితరులు కూడా పాల్గొని కిట్లు పంపిణీ చేశారు .